మొండి గోడలకే పరిమితం

గూడూరు పట్టణ నడిబొడ్డులో ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయంలో గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆర్భాటంగా ఆరంభించిన పలు భవనాలు నిధుల లేమితో ఆగిపోయాయి. ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలి ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

– చిల్లకూరు

- నిర్మాణం పూర్తి చేసుకోని భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- టీడీపీ హయాంలో నిధుల లేమితో వదిలేశారు
- ఇకనైనా పూర్తి చేస్తారో.. లేదో..



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వెలుగు కార్యాలయ భవనం

పరిపాలన సౌలభ్యం కోసమని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేలా ఎన్నో ఏళ్ల క్రితం గూడూరును డివిజన్‌గా చేసి అన్ని కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోకి అడుగు పెడుతూనే ఐసీడీఎస్, వెలుగు, రెవెన్యూ, ఉపఖజానా, సబ్ రిజిస్ట్రార్, పౌర సమాచార సంబంధాలశాఖ, వ్యవసాయ శాఖ, రూరల్ పోలీస్ స్టేషన్‌తో పాటు సబ్ జైలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఈ భవనాలు ఎక్కువ శాతం ఆనాటి బ్రిటీష్ కాలంలో నిర్మించినవి కావడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి.

కొత్త భవనాలకు శ్రీకారం

పాత భవనాలకు మరమ్మతులు చేయాలంటే ప్రతి సారి లక్షల్లో ఖర్చు అవుతుంది. పాత భవనాలను వదలి నూతన భవనాలు నిర్మించేలా ప్రభుత్వం అప్పట్లో నిధులు మంజూరు చేసింది. ఇందులో వెలుగు కార్యాలయం నిర్మించేందుకు రూ.48 లక్షలు వరకు నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం ఆరంభించి, సగంలో నిలిపి వేశారు. దీంతో పొదుపు మహిళలు హౌసింగ్ శాఖ నిర్మించుకున్న నూతన భవనంలోకి వెళ్లి పోయారు. అలాగే హౌసింగ్‌శాఖ ఈఈ కార్యాకలాపాల కోసమని మరో నూతన భవనం నిర్మిస్తే దానిని సబ్ కలెక్టర్ చాంబర్‌గా వినియోగిస్తున్నారు. దీంతో హౌసింగ్ శాఖకు భవనాలు కరువై లక్షలు వెచ్చిస్తూ అద్దె భవనంలో ఉంటున్నారు. ఇదే ప్రాంగణంలోని ఉప ఖజానా కార్యాలయం వర్షాలు వచ్చిన ప్రతి సారి ఉరిసి నీరు లోనికి వచ్చి రికార్డులు భద్రపరిచేందుకు కష్టంగా మారింది. దీనికి నూతన భవనం నిర్మించేందుకని రూ.75 లక్షలు మంజూరు చేసి పనులు మొదలు పెట్టారు. అయితే బిల్లులు మంజూరు కాక సగంలోనే నిర్మాణం ఆగిపోయింది. ప్రస్తుతం అసంపూర్తిగా దర్శనమిస్తూ చుట్టూ పిచ్చి మొక్కలతో నిండి పోయింది. అలాగే భవన నిర్మాణం కోసం వినియోగించాల్సిన ఇనుము తుప్పు పట్టి పోతోంది. జైళ్ల శాఖ ఇక్కడ ఉన్న భవనాలకు మరమ్మతులు చేయించేందుకు ప్రతిసారి నిధులు మంజూరు చేయలేకపోంది. దీంతో ఇక్కడ నుంచి జైలును నెల్లూరుకు తరలించేశారు. ప్రస్తుతం జైలు ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే పౌర సమాచార డివిజనల్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో డీపీఆర్‌ఓ స్థానం కూడా లేకుండా పోయింది. అసంపూర్తిగా మిగిలిపోయిన భవనాలు మందుబాబులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అన్ని ప్రభుత్వ భవనాలు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండడం కలగా మారింది. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసి, అద్దె భవనాలలో కొనసాగుతున్న పలు శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు అందించాల్సి ఉంది.





శిథిలావస్థలో ఉన్న పౌర సమాచారాశాఖ కార్యాలయ భవనం, నిర్మాణం మధ్యలోనే ఆగి పోయిన ఉప ఖజానా కార్యాలయ భవనం

ఒకే చోట ఉంటే మేలు

సబ్ కలెక్టర్ కార్యాలయంలో అసంపూర్తిగా ఉన్న భవనాల స్థానంలో కాంప్లెక్స్‌లా నిర్మించి అన్ని శాఖల కార్యాలయాలను ఒకే చోటకు చేర్చాల్సి ఉంది. ప్రభుత్వ భవన సముదాయానికి నిండుతనం తీసుకువస్తే ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. అద్దె భవనాలలో కొనసాగుతున్న మత్స్యశాఖ, కార్మిక, తూనికలు కొలతలు, నీటిపారుదల, హౌసింగ్, ఉప విద్యాశాఖతోపాటు పలు శాఖల కార్యాలయాలను ఒకే చోటకు చేర్చేలా ప్రణాళికలను సిద్ధం చేసి భవనాల కాంప్లెక్స్ నిర్మించాల్సి ఉంది. ఇలా చేస్తే జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు దీటుగా ఉండడంతో పాటుగా ప్రజలకు ఎంతో ఉపయోగకరం. అటు వైపుగా ప్రజా ప్రతినిధులు అడుగులు వేసి నిధులు మంజూరు చేయిస్తే బాగుంటుంది.

క్లుప్తంగా

వైభవంగా బాలాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



తడ: మండలంలోని పెద్దమాంబట్టు గ్రామంలో బాలాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టను శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో సుందరమైన స్వామి విగ్రహాన్ని తొలుత శుక్రవారం గ్రామంలో ఊరేగించి, పూజలు చేశారు. శనివారం వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి మంత్రోచ్చారణల నడుమ స్వామివారిని వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వైద్యుడు కారణి మునుస్వామి, గ్రామ పెద్దలు చిల్లకూరు దేవేందర్‌రెడ్డి, పురుషోత్తం, మల్లికార్జున్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జీర్ణోద్ధరణ పనులు



శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని పుదూరు గ్రామంలోని ప్రణవ బ్రహ్మసూత్ర ఈశ్వర దేవాలయ జీర్ణోద్ధరణ పనులు జోరందుకుంటున్నాయి. ఏన్నో ఏళ్ల పురాతన చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిల స్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు కలిసికట్టుగా జీర్ణోద్ధరణ పనులను చేస్తున్నారు. గ్రామ పెద్దలతో పాటు అల్లెకూల మనోజ్, దువ్వూరు మధురెడ్డి, చాగణం సుమన్ తదితర యువత సారధ్యంలో ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నారు. దాతల చొరవతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం చేసేందుకు శ్రీకారం చుట్టారు. శనివారం ఆలయం వద్ద జరిగిన కాంక్రీట్ శ్లాబ్ పనుల్లో గ్రామస్తులు పాల్గొని శ్రమదానం చేశారు. వచ్చే శివరాత్రి నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి కుంభాభిషేక వేడుకలను నిర్వహించేలా పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ప్రమాదంలో యువకుడికి గాయాలు

కోట: విద్యానగర్ పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు మోటార్‌బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో బైక్ నడుపుతున్న ప్రవీణ్ అనే యువకుడికి గాయాలయ్యాయి. కోట వైపు వస్తున్న బస్సు ప్రమాదవశాత్తు ఢీకొంది. గాయపడిన యువకుడిని స్థానికులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, చికిత్స అందించారు. అయితే ప్రమాదంపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ప్రమాదంలో రిక్షా కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్: చంద్రబాబునాయుడు కాలనీ సమీపంలో రహదారిపై శనివారం రాత్రి ఆటో ఢీకొన్న ప్రమాదంలో రిక్షా కార్మికుడు నాదెండ్ల సుబ్రహ్మణ్యం(45) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజీవ్ గాంధీ కాలనీకు చెందిన సుబ్రహ్మణ్యం రిక్షా కార్మికుడు. భార్య రత్న, తల్లి చంద్రమ్మలకు జీవనాధారంగా ఉంటున్నాడు. శనివారం రాత్రి రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న ఓ ఆటో వేగంగా వచ్చి సుబ్రహ్మణ్యంను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ప్రమాదానికి కారణమైన ఆటో నిలపకుండా పరారయ్యాడు. సమాచారం అందకున్న పోలీసులు సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరచారు. బాధిత కుటుంబ సభ్యులను నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు.

బేబీ కిట్లు పంపిణీ

గూడూరు రూరల్: గూడూరులోని వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మాతా శిశు కేంద్రంలో ఇటీవల పుట్టిన ప్రతి బిడ్డకు బేబీ కిట్లు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీ అయిన 30 మంది బిడ్డలకు బేబి కిట్లు అందించామని అన్నారు. అనంతరం పాస్ట్ రీజియన్ చైర్మన్ ఆర్వీ రావు, క్యాంప్ చైర్మన్ మురళీనాయుడు, ఎస్‌ఎల్‌ఎన్ స్వామి , రవీంద్రరెడ్డి, గోపినాథ్‌రెడ్డి, ఎన్ సుబ్రహ్మణ్యం, శ్రీనుయాదవ్, పసుపులేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలోని పేరంటాలమిట్ట ప్రాంతంలోని పొలాల్లో 33 కేవీ విద్యుత్ స్తంభం పడిపోయింది. దీంతో నాలుగు గ్రామాలు శనివారం అంధకారంలో ఉన్నాయి. ఈ స్తంభం పడిపోవడంతో ఎగువ ప్రాంతంలోని గొల్లలనట్టు, బురదగాలి కొత్తపాళెం, బుదగాలి, కుమ్మరపాళెం గ్రామాలు చీకటిలో మగ్గుతున్నాయి.

గల్లంతైన వివాహిత మృతదేహం లభ్యం

డక్కిలి: కండలేరు–పూండి కాలువలో గల్లంతైన వివాహిత మృతదేహాన్ని శనివారం గుర్తించారు. పోలీసులు, స్థానికుల కథనం.. మండల కేంద్రమై డక్కిలి పంచాయతీ, నరసనాయుడు పల్లి దళితవాడకు చెందిన కుంచం లక్ష్మి (25) శుక్రవారం గ్రామ సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో గల్లంతైంది. శుక్రవారం రాత్రి వరకు స్థానికులు ముమ్మరంగా గాలించినా ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని కొద్ది దూరంలో లక్ష్మి మృతదేహం లభించింది. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

బెటాలియన్‌లో ఆయుధ ప్రదర్శన



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న 9వ బెటాలియన్ అధికారులు

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా శనివారం ఆయుధ ప్రదర్శన నిర్వహించారు. వెంకటగిరిలోని మనులాలాపేట, భాష్యం, వల్లివేడు పాఠశాల, వాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 780 మంది ప్రదర్శనకు హాజరయ్యారు. 9వ బెటాలియన్ అదనపు కమాండెంట్ అరుణ్‌బోష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆయుధాల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో విద్య నేర్చుకోవడంతోపాటు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను పరిరక్షించడంలో పోలీసుల పాత్ర చాలా కీలకమని తెలిపారు. అనంతరం వారికి విపత్తులు జరిగిన సమయాల్లో చేపట్టాల్సిన రక్షణ, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కోటిరెడ్డి, రామకృష్ణ, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంస్కారవంతమైన రాజకీయం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: రాజకీయాలు సంస్కారవంతంగా ఉండాలే తప్ప రౌడీ రాజకీయాలు చేయకూడదని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామంలోని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసం మీదకు కొందరు టీడీపీ ఆకతాయిలు వెళ్లి భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ఇంటిలో ఉన్న మహిళలపై దౌర్జన్యం చేయడంతోనే ఆయన ఏదైనా ఆవేశంలో దురుసుగా మాట్లాడి ఉండవచ్చునని తెలిపారు. అంత మాత్రాన ఏదో మాట్లాడారని నోటికి వచ్చినట్లు మాట్లాడడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటుగా టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఇంటికి వచ్చి కొడతామని అనడం అమానుషమన్నారు. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అందరికీ సాయం చేసే వ్యక్తిగా ఉన్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని చులకనగా మాట్లాడి ఆయన్ను దుర్భాషలాడడం సముచితం కాదని అన్నారు. గూడూరు నియోజకవర్గంలో ప్రస్తుతం రౌడీయిజంతోపాటుగా ఆకతాయిలు పెరిగి పోతున్నారని తెలిపారు. సంతలో కూడా డైమండ్ డబ్బాలు వేయించే పరిస్థితికి దిగజారి పోయారన్నారు. నాలుగు నెలలే అధికారంలో ఉండి ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కోట, గూడూరు, చిట్టమూరు మండలాల వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు పలగాటి సంపత్ రెడ్డి , బొమ్మిడి శ్రీనివాసులు, సన్నారెడ్డి శ్రీనివాసుల రెడ్డి, నాయకులు మొబీన్‌బాషా, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, కామిరెడ్డి కస్తూరిరెడ్డి, రాజీవ్ రామిరెడ్డి, జలీల్‌బాబు, రూపేష్‌రెడ్డి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సందర్శన



తడ హాస్టల్‌లో న్యాయమూర్తి అనూష

తడ: హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను సూళ్లూరుపేట కోర్టు అదనపు ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి అనూష శనివారం పరిశీలించారు. మండల మేజిస్ట్రేట్ అనూష తొలుత తడలోని బీసీ హాస్టల్, అనంతరం చిన్నమాంబట్టులోని హాస్టల్‌ని పరిశీలించారు. అక్కడి విద్యార్థులు, హాస్టల్ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతులను స్వయంగా పరిశీలించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు, అవసరమైన సదుపాయాల కల్పనపై తయారు చేసే నివేదికను జిల్లా కోర్టుకు సమర్పించనున్నారు. ఆమె వెంట లాయర్లు, తడ ఎస్‌ఐ కొండప్పనాయుడు ఉన్నారు.

సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

వెంకటగిరి(సైదాపురం): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వెంకటగిరి సీహెచ్‌సీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం పోలీసు సిబ్బందితోపాటు పట్టణంలోని పలువురు యువకులు అధిక సంఖ్యలో వైద్యశాలకు చేరుకుని రక్తదానం చేశారు. ఎస్‌ఐలు సుబ్బారావు, గోపి, ఏఎస్‌ఐ బీవీ రమణ, వైద్యులు జిలానీ, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేట పోలీసులు శనివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ నోవా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విశేషంగా పోలీసులు, ఇతర వ్యక్తులు, విద్యార్థి, విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం సైబర్ నేరాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, శ్రీహరికోట ఎస్‌ఐ శ్రీకాంత్ తదితరులు రక్తదానం చేశారు.

వేడుకగా శ్రీవారి కల్యాణం



స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 4 అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

వెంకటగిరి రూరల్: రైతుల ప్రయోజనార్థం అమలులో ఉన్న సమాచార చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకు రావడంపై సమాచార హక్కు చట్టాన్ని 2005లో అమల్లోకి తీసుకువచ్చారన్నారు. ఈ చట్టం ప్రకారంగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఏ శాఖకు సంబంధించిన సమాచారమైనా పొందవచ్చునని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వివరాలు తెలుసుకునేందుకు రూ.5, మండలాల పరిధిలో వివరాలకు రూ.10 రుసుం చెల్లించి వివరాలను తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, ఏఈఓ రామ్మోహన్, గోపీకృష్ణ, వీఏఏలు పాల్గొన్నారు.

మార్కెటింగ్ విధానాలు తెలుసుకోవాలి

నాయుడుపేట టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ నుంచి రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు మార్కెటింగ్ విధానాలపై శనివారం తిరుపతి జిల్లా డీఆర్‌పీ శ్రీనివాసులు అవగాహన కల్పించారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు పొదుపు సంఘాల మహిళలు నిర్వహిస్తున్న వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు జరిపారు. ముందుగా అర్బన్ బజార్‌ను నెలవల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం డీఆర్‌పీ మార్కెటింగ్ చేసే పలు విషయాలపై పొదుపు మహిళలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం సౌజన్య, సీఓ నారాయణమ్మ , మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

వరి సాగులో మెళకువలు పాటించాలి

డక్కిలి: వరి సాగులో రైతులు ముందస్తు మెళకువలు పాటించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ భాస్కరయ్య పేర్కొన్నారు. డక్కిలి మండలంలోని మాధవాయపాళెం రైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయభారతి, రైతులు, గ్రామ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు గోల్‌మాల్

డక్కిలి: మండలంలో రెవెన్యూ రికార్డులు గోల్‌మాల్ అవుతున్నాయని ఏపీ ప్రజాసంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గద్దల మునెయ్య ఆరోపించారు. ప్రజా సంఘాల నేతలతో కలిసి శనివారం తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులుకు రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు గోల్‌మాల్ అవుతున్నాయని ఫిర్యాదు చేశారు. 2008 నుండి 2024వ సంవత్సరం వరకు రెవెన్యూ కార్యాలయంలో జరిగే సాదా బైనామా, మ్యుటేషన్, ఫ్రీహోల్డ్ తదితర రెవెన్యూ రికార్డుల మార్పులపై పెద్ద ఎత్తున రికార్డులు మార్పులు జరిగాయని ఆరోపించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్‌కే రఫీ, మండల అధ్యక్షుడు శీనయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు వినోద్ కుమార్, చెంచుకృష్ణయ్య తదితరులు ఉన్నారు.

కండలేరులో 41.001 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 41.001 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 1000, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలు అందించాలి

బాలాయపల్లి(సైదాపురం): గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ డీపీఎంఓ హరిత పేర్కొన్నారు. బాలాయపల్లి మండలంలోని అలిమిలి ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని శనివారం పరిశీలించి పేదలకు వైద్యసేవలు అందించారు. గ్రామాల్లో చెత్తాచెదారం, మురుగు నీరు, వ్యర్థాలు నిల్వలేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, డీపీఓ ప్రకాష్, ఇన్‌చార్జి పీడీహెచ్ ఎన్‌ఓ నరేష్‌బాబు, ఏఎన్‌ఎంలు సుహాసిని, మేరీ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకంపై అవగాహన



రైతులకు దాణా పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో శనివారం శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెలు, మేకలు పెంపకంపై పశుసంవర్ధక శాఖ సంచాలకులు స్వామిబాబు ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలు మేపుతున్న రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నట్టల నివారణ, గాలికుంటు, నీలినాలుక, చీకటివ్యాధులు ప్రబలే ప్రమాదాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు రైతులు అప్రమత్తమై అధికారుల సూచన మేరకు తగు చర్యలు చేపట్టాలన్నారు. పాడిరైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త పి.నాగార్జునరెడ్డి, డాక్టర్ విజయశ్రీ, తిరుపాల్, రాజీవన, శ్రీనివాసన్ సేవాసంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ గురవయ్య

గూడూరు రూరల్: మండలంలోని అన్ని పంచాయతీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని గూడూరు మండల పరిషత్ అధ్యక్షుడు గురవయ్య తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పల్లె పండుగ పేరుతో చేపడుతున్న పనులను పక్కా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వైస్‌ఎంపీపీ ఇంద్రాణి, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, తహసీల్దార్ చంద్రశేఖర్, పీఆర్‌ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తమ్మినపట్నం గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న తమ్మినపట్నం గ్రామస్తులు

చిల్లకూరు: తీర ప్రాంతంలో క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు సంబంధించి సాగులో ఉన్న రైతులకు పరిహారం ఇవ్వకుండా పనులు చేపట్టవద్దని తమ్మినపట్నం గ్రామస్తులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. తమ్మినపట్నం ప్రాంతంలోని మేకల రేవు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ్మినపట్నం రెవెన్యూ పరిదిలో 914 ఎకరాల భూమిని క్రిస్ సిటీ కోసం సేకరించారని తెలిపారు. అయితే పూర్తి స్థాయిలో భూముల్లో సాగు ఉండగా అధికారులు సర్వే చేసే సమయంలో 300 ఎకరాల్లో సాగు లేదని నమోదు చేశారన్నారు. దీంతో పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలు మార్లు అధికారుల దగ్గరకు వెళ్లి మొర పెట్టుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో గ్రామంలోని వారంతా కలసి పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధుల దగ్గరకు వచ్చి చెప్పినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. చేసేది లేక తాము పనులు అడ్డుకుంటున్నట్లు తెలిపారు. తమకు పరిహారం ఇవ్వకుండా ఎలాంటి అభివృద్ధి పనులు చేయవద్దని వారు హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు పనులు అడ్డుకున్న ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామస్తులు తహసీల్దార్‌ను చుట్టుముట్టి తమకు పరిహారం ఇచ్చే వరకు పనులు మొదలు పెట్టేందుకు ఒప్పుకోమని తెగేసి చెప్పారు. దీంతో తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా కలెక్టర్ కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించి హామీ ఇచ్చారని, సాగులో లేని భూములకు తప్పించి మిగిలిన భూమికి పరిహారం అందించేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని అన్నారు. అయితే గ్రామస్తులు తాము ఒప్పుకోమని భీష్మించి పనులను అడ్డుకున్నారు.

రీచ్ వద్ద ట్రెంచ్ ఏర్పాటు



రీచ్ మధ్యలో వేసిన రోడ్డు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు: కోట మండలం గూడలి ప్రాంతంలో ఇసుకను స్వర్ణముఖి నది నుంచి తరలించుకు పోతుండడంతో సాక్షి దినపత్రికలో శనివారం స్వర్ణముఖిని దోచేస్తున్నారు అనే కథనం వెలవడింది. దీనిపై కోట రెవెన్యూ అధికారులు స్పందించారు. రీచ్‌లో తవ్వకాలు చేపడుతున్న యంత్రాలను అక్కడ నుంచి బయటకు పంపించేశారు. రీచ్ వద్దకు వేసి ఉన్న రోడ్డును పూర్తిగా తొలగించారు. అటు వైపుగా ఎటువంటి వాహనాలు లోనికి వెళ్లకుండా ఉండేలా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా స్వర్ణముఖిలో ఇసుకను తవ్వి తరలించినట్లు గుర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ మధులత, వీఆర్‌ఓ శరణ్య వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

గ్రామసభలను వినియోగించుకోండి



వెలుగోను గ్రామంలో గ్రామసభ

రాపూరు: మండలంలో భూముల రీసర్వేపై జరుగుతున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహం తెలిపారు. రాపూరు మండలం వెలుగోను గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 22 గ్రామాల్లో రీసర్వే నిర్వహించామన్నారు. ఈ గ్రామాల్లో జరిగిన సర్వేలో పేర్లు మార్పులు, హద్దులు తదితర సమస్యలపై అభ్యంతరాలు ఉంటే పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 8 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించామని, ఇప్పటి వరకు 98 సమస్యలపై అభ్యంతరాలను రైతులు తెలిపారన్నారు. వీటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లోని రైతులు భూ రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.